క్లుప్తంగా

బీసీలు ఐక్యంగా ముందుకుసాగాలి


దీక్షలో బీసీ సంఘం నాయకులు

హుజూరాబాద్: అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ ఆమోదం పొందినట్లుగానే పార్లమెంట్‌లో బీసీ బిల్లు ఆమోదిస్తే రాష్ట్రంతో పాటు దేశంలోని బీసీలు బలపడతారని, సామాజిక, రాజకీయ, ఆర్థికంగా నిలదొక్కుకుంటారని పలువురు అన్నారు. బీసీ ఆజాదీ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద చేస్తున్న నిరాహార దీక్షకు మద్దతుగా మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలకు చెందిన నాయకులు, వివిధ పార్టీల లీడర్లు, ప్రముఖ న్యాయవాది ముక్కెర రాజు తదితరులు దీక్షకు సంఘీభావం తెలిపారు. అసెంబ్లీ ఆమోదించిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను పార్లమెంట్‌లో ఆమోదించి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని సంజయ్ కుమార్ చేస్తున్న దీక్షకు మద్దతు ప్రకటించారు. బీసీలంతా ఐక్యంగా ముందుకుసాగితే రాబోయే కాలం వారిదేనని పలువురు వక్తలు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ చిలుకమారి శ్రీనివాస్, బీసీ సిటిజన్ ఫోరం రాష్ట్ర నాయకుడు చందుపట్ల జనార్దన్, రాష్ట్ర కార్యనిర్వహణహక అధ్యక్షుడు కుడికాల భాస్కర్, కార్యదర్శి ఇప్పకాయల సాగర్, సందేలవు వెంకన్న, ఆలేటి రవీందర్, ఆకుల సదానందం, ఉప్పు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బంది, అధికారుల సంబరాలు


సంబరాల్లో మున్సిపల్ అధికారులు, సిబ్బంది

చొప్పదండి: గత ఆర్థిక సంవత్సరం పన్నుల వసూళ్లలో 84.17 శాతం లక్ష్యం చేరుకున్నామని మున్సిపల్ కమిసనర్ కీర్తి నాగరాజు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం నిధుల్లో రూ. కోటి వరకు మున్సిపాలిటీకి విడుదల కానున్నాయని, లక్ష్య సాధనకు సహకరించిన పట్టణంలోని నివాస, వాణిజ్య, రైస్‌మిల్ భవనాల యజమానులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి సంబరాలు నిర్వహించారు. అంకితభావంతో పనిచేసిన అధికారులు, సిబ్బందిని అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ అభినందించారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రశాంత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో 8వ డాన్

హుజూరాబాద్: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఓకినవ కరాటే హోచి దాన్‌లో సీనియర్ కరాటే శిక్షకుడు ఎస్.సంపత్‌కుమార్‌కు బ్లాక్ బెల్ట్ 8 డాన్ రావడం పట్ల పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వి.సతీశ్‌కుమార్, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్‌బాబు, హుజూరాబాద్ కరాటే శిక్షకులు ఇందుర్తి రమేశ్ కుమార్, నరేశ్‌కుమార్‌లు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. దేశంలో కరాటేలో 8వ డాన్ పొందిన ఆరుగురిలో సంపత్‌కుమార్ ఉండడం గర్వకారణమని, సంపత్‌కుమార్ హుజూరాబాద్ డివిజన్‌లో ఎంతో మంది కరాటే వీరులను తయారు చేశారని గుర్తుచేశారు.

గ్యాస్ వినియోగదారులు ఈ - కేవైసీ చేసుకోవాలి



హుజూరాబాద్: హుజూరాబాద్ ప్రాంతంలోని వంట గ్యాస్ వినియోగదారులు ఈ - కేవైసీ చేసుకోవాలని హుజూరాబాద్ అంబుజా గ్యాస్ ఏజెన్సీ అధినేత పీవీ మదన్‌మోహన్‌రావు మంగళవారం తెలిపారు. గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వెబ్‌సైట్‌తో ఈ-కేవైసీ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ-కేవైసీ చేసుకోని కస్టమర్లకు ప్రభుత్వ రాయితీ రద్దయ్యే అవకాశం ఉందని, సందేహాలకు సెల్ 6304981288 సంప్రదించాలన్నారు.

రాజకీయ పబ్బం కోసం కంటి తుడుపు చర్యలు

హుజూరాబాద్: కులగణన ఆధారంగా రాష్ట్రంలోని బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో ఆమోదించిన బిల్లుపై పాలకులకు చిత్తశుద్ధిలేదని, రాజకీయ పబ్బం కోసం ఇవి కంటి తుడుపు చర్యలు మాత్రమేనని ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు ఆరోపించారు. మంగళవారం హుజూరాబాద్‌లో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ బిల్లును గవర్నర్ ద్వారా ఆమోదింపజేస్తే బిల్లు చట్టరూపం దాల్చుదుందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ నోటిఫికేషన్ జారీ చేసి వెంటనే స్థానిక ఎన్నికలు నిర్వహించవచ్చునని అన్నారు. 2011లో దేశవ్యాప్తంగా నిర్వహించిన కులగణన లెక్కలు కేంద్రం బయటపెట్టి కులగనణ ఆధారంగా బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

చేలు తడవక.. చేసేదేమీ లేక

- బోరున విలపిస్తున్న రైతన్నలు
- సాగునీరందక ఎండుతున్న పొలాలు
- పంట నష్టంపై సర్వే చేయని అధికారులు
- స్పందించని ప్రభుత్వం, అందని సాయం
- ఎండిందిపోగా మిగిలింది చేతికందేనా?


పశువుల మేతగా మొక్కజొన్న పంట

గంగాధర: మండలంలోని రంగరావుపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే రైతు భూమి కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తున్నాడు. రెండెకరాల్లో మొక్కజొన్నసాగు చేశాడు. పీచు దశలో సాగునీటి సమస్య రావడంతో పశువుల మేతకు వదిలేశాడు. అలాగే కాసారం గ్రామానికి చెందిన ముద్దెర ఓదెలు అనే రైతు ఐదెకరాల్లో వరిపంట సాగు చేయగా సాగునీటి సమస్య రావడంతో రెండున్నర ఎకరాలు ఎండిపోయింది. మిగితా రెండున్నర ఎకరాల వరి పంట చేతికందే సమయంలో సాగు నీరు సరిపోక పోవడంతో ట్యాంకర్‌తో నీళ్లు పారిస్తుండగా అనుకోకుండా ఇటీవల కురిసిన అకాల వర్షంతో ఉన్న పొలానికి కొంత ఊరట కలిగింది.

మండలంలోని గర్శకుర్తి గ్రామానికి చెందిన మరో రైతు దాది ఐలయ్య వ్యవసాయ బావి ఆధారంగా రెండు ఎకరాలు వరిపంట సాగు చేశాడు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతోపాటు బావిలోని నీళ్లు ఇంకి పోయాయి. సాగు నీటి సమస్యతో పంటపొలాన్ని పశువుల మేతకు వదిలేశాడు. అలాగే మండలంలోని రంగరావుపల్లి, ఉప్పరమల్యాల, తాడిజర్రి, గర్శకుర్తి, కాసారం, వెంకంపల్లి, గోపాల్‌రావుపల్లి, పిట్టలపల్లి గ్రామాలలో ఏ రైతును కదిలించినా సాగునీటి సమస్యతో పంట నష్టం గురించే మాట్లాడుతున్నారు. పంటలు సాగు చేసి తెగుల్ల బారి నుంచి కాపాడుకుంటూ పంట చేతికందడానికి ఆరుగాలం శ్రమిస్తుంటే భూగర్భ జలాలు అడుగంటి, బావులు, బోర్లు వట్టిపోయాయని పంటలు ఎండిపోతుంటే పట్టించుకునేవారు కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రంగరావుపల్లి, ఉప్పరమల్యాల, తాడిజర్రి, గర్శకుర్తి, కాసారం, వెంకంపల్లి, గోపాల్‌రావుపల్లి, పిట్టలపల్లి తదితర గ్రామాలలో సాగు నీటి వనరులున్నా వాటిలో నీరు లేక పోవడంతో భూగర్భజలాలు అడుగంటి పోయాయి. వేసవి ముదరడంతో గంటల తరబడి పోసిన మోటార్లు నిమిషాలకు వచ్చాయి. చాలా మంది రైతుల పంటపొలాలు ఎండిపోయాయి. ఇటీవల కురిసిన అకాల వర్షం కొంత ఊరట కలిగించినా ఎండిపోగా మిగిలిన పంటలు చేతికందే వరకు నమ్మకం లేదంటున్నారు. అయినా వ్యవసాయ అధికారులు వచ్చి సర్వే చేయడం లేదు, ప్రభుత్వం స్పందించి సాయం చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గర్శకుర్తిలో ఎండిన వరిపంట

పైపులతో పారిస్తున్నాం


ముగ్గురం అన్నదమ్ములం. ఒకే వ్యవసాయబావి ఆధారంగా ఒక్కొక్క రం ఎకరంన్నర వరి సాగు చే శాం. బావిలో నీళ్లు తగ్గిపో యి ముగ్గురివి ఇరవై గుంట ల చొప్పును ఎండింది. అకాల వర్షంతో మిగతా పొలం దక్కింది. ఉన్న పొలాన్ని పైపులతో పారిస్తున్నాం. – చల్ల మల్లయ్య, రైతు తాడిజర్రి

పావుగంటే పోత్తుంది


నాకు 27 గజాల లోతున్న వ్యవసాయ బావి ఉంది. పావుతక్కువ రెండు ఎకరాల వరి పంటసాగు చేసాను. మొదట్లో మూడు గంటలు పోసిన మోటరు ప్రస్తుతం పావుగంటే పోత్తుంది. ఇరువై గుంటల పొలం మిగిలింది. మిగితాది ఎండిపోయింది. – కొంరయ్య, రైతు ఉప్పరమల్యాల

అరెకరం ఎండింది


నాకున్న ఎకరంన్నర పొలంలో వరి సాగు చేశాను. ఇప్పటికే సాగునీటి సమస్యతో అరెకరం పొలం ఎండిపోయింది. ఇటీవల కురిసిన వర్షంతో మిగితా పొలం కాస్తా పదనుంది. ఎండలు ముదిరితే బావిలో నీళ్లు ఇంకిఉన్న పొలం కూడా ఎండిపోతది. – సురకాని హన్మండ్లు,రైతు, ఉప్పరమల్యాల

పేదల కడుపు నింపడమే లక్ష్యం


చొప్పదండి: వెదురుగట్టలో సన్నబియ్యం పంపిణీ


హుజూరాబాద్‌లో వొడితల ప్రణవ్‌బాబు

చొప్పదండి: నిరుపేదల కడుపు నింపడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పథకానికి శ్రీకారం చుట్టిందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేశ్ అన్నారు. మండలంలోని వెదురుగట్టలో మంగళవారం డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటి రెడ్డి పద్మాకర్ రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డితో కలిసి సన్నబియ్యం పథకం ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు.

జమ్మికుంట: మున్సిపల్ పరిధి, మండలంలోని గ్రామాల్లోని రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. మున్సిపల్ పరిధి కొత్తపల్లిలో ఇల్లందకుంట శ్రీసీతారామ చంద్రస్వామి దేవాస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి, పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్, హౌజింగ్ బోర్డు కాలనిలో మాజీ కౌన్సిలర్ శ్రీపతి నరేష్, విలాసాగర్ గ్రామ అధ్యక్షుడు రాచపల్లి శ్రీనివాస్, కోరపల్లిలో కాంగ్రెస్ నాయకులు పింగిళి రాకేశ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

హుజూరాబాద్: పేదవాడి కడుపు నింపడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్‌బాబు అన్నారు. మండలంలోని కందుగులలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పేదల అభ్యున్నతి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పథకాన్ని ప్రారంభించిందని, వరి వేస్తే ఉరి అని చెప్పిన నాయకులు ఆశ్చర్యపడేలా ఇతర దేశాలకు సైతం సన్న బియ్యాన్ని ఎగుమతి చేసే స్థాయికి తెలంగాణ ఎదిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదవాడి ఆకలి తీర్చడానికి కృషి చేస్తుందని, రానున్న రోజుల్లో అన్ని రేషన్ షాపులలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు.

ఇల్లందకుంట: పేదవాడి కడుపునిండా సన్న బియ్యం అన్నం పెట్టే స్థితి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకవచ్చిందని వొడితల ప్రణవ్ అన్నారు.టేకుర్తి, రాచపల్లి, సిరిసేడు గ్రామాల్లో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ వినియోగదారులకు ఉచిత సన్న బియ్యం పంపిణీ చేసే పథకాన్ని ప్రారంభించారు. సిరిసేడు గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్త మర్రి తిరుపతిరెడ్డి ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందగా ఆయన కుటుంబాన్ని వొడితల ప్రణవ్ పరామర్శించారు. కుటుంబానికి భరోసా ఉంటామన్నారు.

సైదాపూర్: సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మండలంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్ ప్రారంభించారు. సన్న బియ్యం పంపిణీతో ప్రజలు ఆనందం వ్యక్తంచేశారు.

శంకరపట్నం: మండలంలోని రేషన్ షాపుల్లో సన్న బియ్యం పథకాన్ని తహసీల్దార్ భాస్కర్‌తో కలిసి మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. పలు రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం కోసం లబ్ధిదారులు బారులు తీరారు.

గన్నేరువరం: మండలంలోని రేషన్‌షాపుల్లో సన్నబియ్యం పంపిణీని కాంగ్రెస్ నాయకులు, రేషన్ డీలర్లు కలిసి ప్రారంభించారు.

చిగురుమామిడి: కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి అన్నారు. సుందరగిరి, చిగురుమామిడి, ఇందుర్తి, రేకొండ గ్రామాల్లో తహసీల్దార్ ఎం రమేశ్ తో కలిసి రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేశారు.

నాయకుల ముందస్తు అరెస్టు



పోలీసుల అదుపులో సీపీఎం నాయకులు

హుజూరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకం విషయంలో ఆందోళన చేపట్టనున్నారని హుజూరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పాడిశెట్టి అభిలాశ్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్టులు చేసి విద్యార్థి పోరాటాన్ని ఆపాలని ప్రభుత్వం అనుకుంటుందని, అక్రమ అరెస్టుల ద్వారా ఉద్యమాన్ని ఆపాలని చూస్తే ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. 400 ఎకరాల భూమిని అమ్మి మూగజీవాలను పొట్టన పెట్టుకుంటున్నారని, ప్రభుత్వ భూములను కార్పొరేట్లకు అప్పనంగా ధారాదత్తం చేయాలని ఆలోచిస్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి వైఖరి మార్చుకోవాలని అన్నారు.

జమ్మికుంట: హెచ్‌సీయూ భూముల వేలాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం మండల సహాయ కార్యదర్శి వడ్లూరి కిషోర్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో మాట్లాడారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ కేటాయించిన భూములను ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దారదత్తం చేసే కుట్ర చేస్తుందన్నారు. విశ్వవిద్యాలయాలను ప్రపంచలోనే నెంబర్ 1గా చేస్తానని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్లకు కక్కుర్తి పడి, విద్యార్థి సంఘాలను అరెస్ట్ చేసి జైలు పంపించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. భూముల అమ్మకం నిలిపివేయక పోతే ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. విశ్వవిద్యాయాలు తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించాయని, హెచ్‌సీయూ భూముల అమ్మకం దౌర్భాగ్యమైన చర్య అని మాజీ జెడ్పీటీసీ శ్రీరామ్‌శ్యామ్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి భూ ముల వేలం విరమించుకోవాలని హెచ్చరించారు.

శంకరపట్నం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను ప్రభుత్వం విక్రయించొద్దని, యూనివర్సిటీ ఎదుట నిర్వహించే ధర్నాకు వెళ్లకుండా సీపీఎం మండల కార్యదర్శి రాజిరెడ్డి, వడ్ల రాజును కేశవపట్నం పోలీసులు అరెస్ట్ చేశారు. సీపీఎం పిలుపు మేరకు ధర్నాకు వెళతారనే ముందస్తు సమాచారంతో మంగళవారం తెల్లవారుజామున అరెస్ట్ చేసి సాయంత్రం వదిలిపెట్టారు.

సన్మానం

గంగాధర: గంగాధర పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా పని చేసి ఉద్యోగవిరమణ పొందిన దాసరి రమణారెడ్డిని సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎస్సై వంశీకృష్ణ మాట్లాడుతూ..ప్రభుత్వ ఉద్యోగికి బదలీతో పాటు ఉద్యోగ విరమణ తప్పదని, విధులు నిర్వహించే చోట గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు.

ఉగాది బాల పురస్కారం

శంకరపట్నం: మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన ఎనిరెడ్డి శ్రీవేధ ఉగాది బాలపురస్కారం అందుకున్నారు. ఎనిరెడ్డి శ్రీనివాస్-సుమలత కూతురు శ్రీవేద ఉగాది పర్వదినం సందర్భంగా త్యాగరాజ గాన సభలో కూచిపూడి నృత్యం చేయగా మహతి ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో మెమోంటో, ప్రశంసాపత్రం అందజేశారు.

నియామకం

గంగాధర: ఆల్ ఇండియా రెడ్డి సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని మంగపేట గ్రామానికి చెందిన బైరి గంగారెడ్డిని జిల్లా అధ్యక్షుడు బీరెడ్డి కరుణాకర్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ సందర్భంగా గంగారెడ్డి మాట్లాడారు. రెడ్డిల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు.

ఆదివాసీ తోటి తెగ సంఘం

సైదాపూర్: ఆదివాసీ తోటి తెగ సంఘం మండల నూతన కమిటీ అధ్యక్షుడిగా సోయం రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని ఆదివాసీ తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు గుర్రాల రవీందర్, షడమాకి సారయ్య మంగళవారం ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా గురాల రాజేందర్, ఉపాధ్యక్షుడిగా షడమాకీ భిక్షపతి, కోశాధికారిగా తిరుపతి, మండల ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడిగా సోయం రాంబాబు, షడమాకి రాజేందర్, కుల పెద్ద మనిషిగా గురాల మల్లయ్యను ఎన్నుకున్నామని తెలిపారు.

నూతన కార్యవర్గం


పద్మశాలీ కార్యవర్గం సభ్యులు

గన్నేరువరం: జంగపల్లి గ్రామ పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుంటుక ఆంజనేయులు, కార్య నిర్వహణ అధికారిగా గుంటుక భూశంకర్, సలహాదారుడిగా గుంటుక లక్ష్మీపతిని ఎన్నుకున్నామని సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వీరేశం, రాజేశం, మురారి, భాస్కర్, నారాయణమూర్తి, ఆంజనేయులు, భాస్కర్, శ్రీనివాస్, గుంటుక అశోక్, వెంగళ దత్తు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న సీఎం

కరీంనగర్: రైతులకు రూ.15వేలు రైతుబంధు ఇస్తామని అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి రెండు పంటలకు రైతుబంధు ఇవ్వకుండా అబద్ధపు మాటలతో మోసం చేస్తున్నారని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. మంగళవారం కరీంనగర్‌లో మాట్లాడారు. కోవిడ్ సమయంలో ఎమ్మెల్యేల జీతాలను ఇవ్వకుండా రైతుల ఖాతాల్లో రైతుబంధు సాయాన్ని అందించి కేసీఆర్ రైతులకు అండగా నిలిచారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండు పంటల రైతుబంధు ఎగ్గొట్టిందని, మూడో పంట కోతలకు వచ్చినా కూడా ఇప్పటికీ రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయలేదని ఆరోపించారు.



హుజూరాబాద్: మండలంలోని రాంపూర్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం ఎదురుగా వ్యవసాయ బావి ప్రమాదకరంగా ఉంది. దీంతో చిన్నారుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు బావిచుట్టూ ప్రహరీ నిర్మించే విధంగా చర్యలు తీసుకువాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
తూర్పాటి సునీత, ఎంపీడీవో, హుజూరాబాద్ సెల్ నంబర్: 99899 30709

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం



చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్‌లో శ్రీలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వేద పండితులు విష్ణువర్ధనాచార్యుల ఆధ్వర్యంలో గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. బుధవారం సాయంత్రం గ్రామంలో బండ్ల మహోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు బైరి కృష్ణమూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ తిమ్మాపూర్ మండల అధ్యక్షుడి రాజీనామా?


ఎమ్మెల్యే కవ్వంపల్లి తో రమణారెడ్డి(ఫైల్)

తిమ్మాపూర్: అధికారర కాంగ్రెస్ పార్టీలో కీలక పరిణామం చోటుచేసుకోబోతోందా.. అంటే అవుననే అంటున్నారు తిమ్మాపూర్ మండలలంలోని నాయకులు. పార్టీ కోసం నాలుగేళ్ల కష్టపడి పనిచేసిన తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి తన పదవికి బుధవారం రాజీనామా చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రమణారెడ్డి మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారు. 2023 ఎన్నికల్లో మానకొండూర్ ఎమ్మెల్యేగా కవ్వంపల్లి సత్యనారాయణ గెలుపులో కీలకంగా వ్యవహరించారు. పార్టీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యేకు ముఖ్య అనుచరుడిగా కొనసాగారు.

ఏం జరిగింది...

ప్రస్తుతం పార్టీలో సంస్థగత మార్పులు జరగడం లేదు. సభ్యత్వ నమోదు, మండల కార్యవర్గాల ఎన్నికల ప్రక్రియ లేదు. అయినా తిమ్మాపూర్ మండల అధ్యక్ష పదవికి రమణారెడ్డి రాజీనామా వార్త మండలంలో చర్చనీయాంశమైంది. ఆయన వెంటే పలు గ్రామాల అధ్యక్షులు కూడా రాజీనామా చేసే ఆలోచన ఉన్నట్లు తెలిసింది. ఉన్నట్టుండి ఎందుకు రాజీనామా చేయాల్సి వస్తోంది.. ఎవరైనా ఒత్తిడి చేశారా.. లేక ఇంకా ఏదైనా జరిగిందా అన్న చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యే ఒత్తిడితోనే రాజీనామా చేస్తున్నారని గుసగుసలాడుతన్నారు. పదవి రాజీనామా చేయడం వెనుక ఎవరిదైనా హస్తం ఉందా సాధారణంగా చేస్తున్నాడా అనే వివరాలు ఇంకా తెలియదు. కొత్తవారు, యువతకు ప్రాధాన్యం ఇవ్వడం కోసం రాజీనామా చేనున్నట్లు ప్రచారం కూడా జరుగుతోంది.

యథేచ్ఛగా కబ్జాలు

హుజూరాబాద్: పట్టణంలోని వరంగల్ రోడ్డును ఆనుకొని పెద్దమోరి కింద ప్రవహించే చిలుక వాగును పక్కనే ఉన్న భూసాములు కబ్జా చేసి కమర్షియల్ కాంప్లెక్స్‌లు కడుతుంటే చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ముదిరాజ్ మహాసభ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొలిపాక సమ్మయ్య ముదిరాజ్ అన్నారు. మంగళవారం హుజూరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుంటలు, చెరువులు వాటి కట్టు కాలువలు కబ్జాకు గురవుతున్నాయని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోయిన చర్యలు శూన్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పలనర్సింగాపూర్‌ను ఆనుకొని వాగు పొడవునా నిర్మించిన చెక్ డ్యామ్‌లతో పరివాహక పంటలకు నిరందిస్తూ చెల్పూరు చెరువును నింపే చిలుకవాగును సైతం కబ్జాదారులు వదలడం లేదని, యథేచ్ఛగా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. కలెక్టర్ స్పందించి ప్రభుత్వ భూములు, చెరువులు, వాగులను కబ్జా చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శంకరపట్నం: మండలంలోని తాడికల్ బస్టాండ్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలైనట్లు స్థానికులు తెలిపారు. హుస్నాబాద్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి బైక్‌పై కరీంనగర్ వెళ్తుండగా తాడికల్ గ్రామానికి చెందిన జనగాం చంద్రమౌళి మోపెడ్‌తో ఢీకొట్టాడు. ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

సాగునీరిచ్చి పంటలను కాపాడాలి

కొత్తపల్లి: చివరి ఆయకట్టు వరకు సాగునీరందించి పంటలను కాపాడాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు అన్నాడి రాజిరెడ్డి డిమాండ్ చేశారు. కొత్తపల్లి పట్టణ శివారులోని పంటలను మంగళవారం బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో పరిశీలించారు. నీరు లేక పంటలు ఎండుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. డీ93 కాలువ ద్వారా నీరందక పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. ఈ కాలువ ద్వారా ప్రధానంగా చివరి ఆయకట్టు గ్రామాల వరకు పొలాలకు నీరందక వందల ఎకరాలు నష్టపోయే పరిస్థితులున్నాయన్నారు. నీళ్ల లేక పంటను కాపాడుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సాగు నీటిని విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. మాజీ ఎంపీపీ రమేశ్, బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు శేఖర్, నాయకులు లక్ష్మారెడ్డి, నరసింహారెడ్డి, హరిప్రసాద్, మహేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సంపత్, మోహన్, చిట్యాకు శ్రీనివాస్, వే ముల చంద్రశేఖర్, రవిప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కోతిరాంపూర్‌లోని వోక్స్‌వాగన్ షోరూంలో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది, కస్టమర్లకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని షోరూం మేనేజర్ లక్ష్మణ్ ప్రారంభించారు. 110 మందికి ఆసుపత్రి వైద్యుడు ప్రవీణ్ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి షుగర్, బీపీ, 2డీ ఎకో పరీక్షలు చేపట్టి రోగ నిర్ధారణ చేశారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడారు. సైదులు, సంపత్, కోట కరుణాకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటో స్టూడియోల బంద్

చొప్పదండి: మండలంలో బుధ, గురువారం ఫొటో స్టూడియోల బంద్ నిర్వహిస్తున్నామని ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ప్రింటింగ్, ఇంకు, పీవీసీ ధరలు పెరిగినందున ఫొటో ప్రింటింగ్ ధరలు పెంచేందుకు బంద్ నిర్వహిస్తున్నామని, కస్టమర్లు సహకరించాలని కోరారు.